క్లుప్తంగా

నివాళి



సరోజమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరులో ఇటీవల మృతి చెందిన గున్నేరి సరోజమ్మ కర్మ క్రియలకు బుధవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి హాజరయ్యారు. సరోజమ్మకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ కందాటి మోహనప్రియ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ

తొట్టంబేడు: మండలంలోని పెద్దకనపర్తిలో బుధవారం అంబేడ్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి మహోన్నత కార్యక్రమానికి తాను రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్రీదేవిని వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం సన్మానించారు. ఈసందర్భంగా వారు తహసీల్దార్‌తో మాట్లాడుతూ మండలంలో పలు భూ సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని వారు తహసీల్దార్‌ను కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గెడితొట్టి గురవయ్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సత్యవేడు: స్థానిక బీసీ కాలనీకి చెందిన ఎస్. పవన్ కల్యాణ్(26) అనే యువకుడు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసగా మారిన పవన్ కల్యాణ్ నిత్యం డబ్బుల కోసం తల్లితో గొడవపడేవాడు. ఈక్రమంలో ఆమె నగదు ఇవ్వకపోవడంతో గులికల మందు తాగేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



గాయపడిన మహిళను తీసుకెళుతున్న స్థానికులు

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో 10 రోజులుగా గ్యాస్ పైపులైన్ కోసం తీస్తున్న గోతులు వాహనచోదకుల ప్రాణాల మీదకు వస్తున్నాయి. తీసిన గోతులను సకాలంలో పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అటుగా వెళ్లే వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువ కోసం తీసిన మట్టి రోడ్డుకు అడ్డంగా వేయడంతో తాజాగా బుధవారం సాయంత్రం స్టేట్ బ్యాంక్ సమీపంలో భార్యాభర్తలతోపాటు, కుమారుడు స్కూటీపై వెళుతూ ప్రమాదానికి గురై గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక వైద్యం చేయించారు. ఇలా నిత్యం వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నా పైపులైన్ నిర్వాహకులు మాత్రం తమ కేమీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అనుమతులు ఇచ్చిన అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

పేదలు పరేషాన్

ప్రతి కుటుంబానికి ఉచితంగా అందుతున్న రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి పేదలు రూ.వంద ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి వస్తుండగా మరికొందరు చేతిచమురు వదిలించుకుంటున్నారు. రేణిగుంట మండలంలో ఇలా పలు గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. దీంతో పేదలు పరేషాన్ అవుతున్నారు.

- మళ్లీ మొదలవుతున్న రేషన్ కష్టాలు
- ఐదేళ్లు సజావుగా సాగిన రేషన్ పంపిణీ
- ప్రభుత్వ నిర్ణయంపై ఆవేదన చెందుతున్న ప్రజలు



రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనం

రేణిగుంట: కూటమి సర్కారు ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో ప్రజలకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయి. రేణిగుంట మండలంలో సుమారు 21,500 రేషన్ కార్డులు ఉన్నాయి. సుమారు 110 గ్రామాలకు 44 షాపులు ఉన్నాయి. ప్రతి నెలా ప్రజలు రేషన్ షాప్‌నకు వెళ్లి సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని గతంలో వైఎస్సార్‌సీపీ సర్కారు ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు ఎండీయూ వ్యవస్థను ఏర్పాటు చేసింది. గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు ఎండీయూ ఆపరేటర్లుగా ఉపాధి కల్పించడంతోపాటు ప్రతి ఇంటికీ రేషన్ బియ్యాన్ని సకాలంలో పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు.

మూడు కిలోమీటర్లు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నాం



మా గ్రామం నుంచి రేషన్ షాపు ఉండే గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరం ఉంది. ప్రతినెలా రేషన్‌షాపు వద్దకు వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. రేషన్ షాపు వద్దకు వెళ్లి రావడానికి ఆటోకు రూ.40 చార్జీ అవుతుంది. గతంలో మా గ్రామానికి వాహనం వచ్చి రేషన్ బియ్యం ఇచ్చేవారు ఇప్పుడు వాహనాలను రద్దు చేయడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

–చెంగమ్మ, బీసీ కాలనీ, కరకంబాడి

వాహనాల రద్దు దారుణం



గత ఐదేళ్లుగా ఇంటి వద్దే రేషన్ తీసుకోవడం అలవాటు చేసుకున్నాం. అంతకుముందు రేషన్ షాపులు ఎప్పుడు ఇచ్చేవారు తెలిసేది కాదు. కానీ గత ప్రభుత్వంలో వచ్చిన రేషన్ బియ్యం వాహనాలు మా గ్రామంలో వచ్చి మా వీధిలో సైరన్ మోగించి అందరికీ బియ్యం పంపిణీ చేసేవారు. ఇప్పుడు మళ్లీ రేషన్ బియ్యం కష్టాలు వచ్చాయి. ప్రజా అభిప్రాయం లేకుండా ప్రభుత్వం వాహనాలను రద్దు చేయడం ఏమిటి. ప్రజలు పడుతున్న కష్టాలు తెలుసుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలి.

–సుశీలమ్మ, రామకృష్ణాపురం, రేణిగుంట

రేషన్ కష్టాలు మళ్లీ మొదలు



రేషన్ షాపు వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకునే బాధ లేకుండా ఉండింది. కూటమి ప్రభుత్వం పుణ్యమాని మళ్లీ రేషన్ కష్టాలు వచ్చాయి. రేషన్ షాపు వద్దకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలుచుకునే రోజులు మళ్లీ వచ్చాయి. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉండేవి తీసేయడం దారుణం.

– శేఖర్, ఎస్‌యాపురం, రేణిగుంట

ఊరుగా మారుతున్న మదనపాళెం చెరువు

వరదయ్యపాళెం: సత్యవేడు మండలంలో మాదనపాళెం చెరువు ఆక్రమణలతో ఊరవుతోంది. స్థానికులు కొందరు చెరువుపై కన్నేసి ఏకంగా రాత్రికి రాత్రి అక్రమ నిర్మాణాలతో దర్జాగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. మాదనపాళెం రెవెన్యూ లెక్కల దాఖల్లోని సర్వే నంబర్ 839లో 11 ఎకరాల విస్తీర్ణంలో ఇరిగేషన్ చెరువు ఉంది. అయితే చెరువు ఆయకట్టు భూములు శ్రీసిటీ సెజ్‌కు భూసేకరణ ద్వారా కేటాయించారు. దీన్ని అలుసుగా తీసుకున్న ఆక్రమణదారులు కొందరు ఏకంగా రోడ్డుకు ఆనుకుని ఉన్న చెరువు భూమిని ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కళ్లు తెరిచి ఆక్రమణలపై కొరడా ఝులిపించాలని కోరుతున్నారు.



మాదనపాళెం చెరువులో నిర్మించిన ఇళ్లు

తుడా పార్కు పరిశీలన



పార్కును పరిశీలిస్తున్న సర్పంచ్ నగేషం, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

రేణిగుంట: స్థానిక బిస్మిల్లానగర్‌లోని తుడా పార్కును అధికారులు, సర్పంచ్ బుధవారం పరిశీలించారు. పంచాయతీలోని బిస్మిల్లానగర్ తుడా పార్కు దుస్థితిపై బుధవారం సాక్షి దినపత్రికలో 'నాడు కళకళ.. నేడు వెలవెల' వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు పార్కును పరిశీలించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సర్పంచ్ నగేషం బుధవారం పార్కును పరిశీలించి, అక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. వెంటనే పార్కు సుందరీకరణ పనులు చేపడుతామని, పిల్లలు ఆడుకునే ఆట వస్తువులను మరమ్మతులు చేసి, పార్కుకు పూర్వ వైభవం తీసుకువస్తామని సర్పంచ్ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



సుధీర్‌రెడ్డి

వరదయ్యపాళెం: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఎర్రంరెడ్డి సుధీర్ రెడ్డి బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. వడమాలపేట మండలంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న ఆయనను వరదయ్యపాళెంకు బదిలీ చేసి ఇన్‌చార్జ్ ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ రాజశేఖర్‌ను డిప్యూటేషన్‌పై సత్యవేడు మండలానికి బదిలీ చేశారు.

ఘనంగా గంగ జాతర

రేణిగుంట: మండలంలోని అత్తూరులో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. నడి వీధిలో కొలువైన గంగమ్మ తల్లికి ఉదయం గ్రామంలోని మహిళలు అంబుళ్లు పోశారు. అనంతరం అమ్మవారికి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. బ్యాండ్ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ నిర్వాహకులు అతిథులను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.



విశేషాలంకరణలో గంగమ్మ

విలువలు లేని సమావేశం మాకొద్దు

- డుమ్మా కొట్టిన ఎంపీటీసీ సభ్యులు
- కోరం లేక వాయిదా

నాగలాపురం: ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వారి నిర్లక్ష్యానికి నిరసనగా నాగలాపురం మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి సంబంధించి పది మంది ఎంపీటీసీలు ఉండగా ఒక్కరు కూడా హాజరు కాలేదు. కోరం లేకపోవడంతో సర్వసభ్య సమావేశాన్ని అధికారులు వాయిదా వేశారు. ఎంపీపీ సింధూ, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంపై సమాచారం ఇవ్వడంలో సైతం మండల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువలు లేవని అలాంటిది సర్వసభ్య సమావేశానికి ఎందుకు హాజరు కావాలని ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీఓ సమాధానం ఇవ్వాలని వారు కోరారు.



డుమ్మా కొట్టిన ఎంపీటీసీ సభ్యులు

రాజీవ్ గాంధీకి నివాళి

రేణిగుంట: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం రేణిగుంటలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీఆర్ రావణ ఆధ్వర్యంలోని కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ ఉచితంగా పంపిణీ చేశారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్యనాయుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి జరుపుకున్నారు. రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు సురేంద్రరెడ్డి, నవీన్, కల్యాణ్, రాజేంద్ర, ప్రభాస్ పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తు మన బాధ్యత





రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ప్రగతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

రేణిగుంట: పిల్లల భవిష్యత్తు మన బాధ్యత అని ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల సమన్వయకర్త జయలక్ష్మి అన్నారు. మండలంలోని మల్లిమడుగు గిరిజన కాలనీ, వెదళ్లచెరువు గిరిజన కాలనీలో బుధవారం ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పిల్లల పెంపకంపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమన్వయకర్త జయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలు సమాజంలో అభివృద్ధి చెందాలంటే తల్లిదండ్రులు పిల్లలను అన్ని విధాలుగా స్థిరమైన స్థాయిలో ఉంచేలా చూడాలన్నారు. పిల్లల పెంపకంపై వివిధ అంశాలపై నాలుగు వారాలపాటు వారానికి ఒక్కరోజు చొప్పున అవగాహన కల్పిస్తామని తెలిపారు.

ఏర్పేడులో...

మండలంలోని కొత్త వీరాపురం గ్రామంలో పిల్లల పెంపకంపై ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల సమన్వయకర్త శిరీష ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారన్నారు. పిల్లల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ కాలంతో పోటీపడుతున్నారని తెలిపారు. పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లోను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో రాస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మంచి మనిషి శాంతారామ్ పవార్



శాంతారామ్ పవార్‌కు నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ది స్కూల్ ఆవరణలో పురపాలక సంఘం, శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ చైర్మన్ శాంతారామ్ పవార్ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుమార్తె డాక్టర్ అర్చన పవార్ మాట్లాడుతూ శాంతారామ్ పవార్ ఎప్పటికీ మరచిపోలేని ప్రజల మనిషి అన్నారు. ది స్కూల్ కరస్పాండెంట్ జనార్దన్‌రావు పవార్, ప్రతాప్‌రావ్ పవార్, ముకుందరావు పవార్, ప్రధానోపాధ్యాయురాలు విశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్‌తో నూకతోటి, ఎంపీపీ భేటీ

నారాయణవనం: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, నారాయణవనం ఎంపీపీ దివాకర్‌రెడ్డి కలిశారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిసిన తర్వాత వారు మాట్లాడుతూ మండలంలో పార్టీ పటిష్టతకు కృషిచేయాలని, పార్టీ శ్రేణుల్లో మనోధైర్యం నింపాల ని జగనన్న సూచించినట్లు పేర్కొన్నారు.



జగన్‌తో నూకతోటి రాజేష్, దివాకర్‌రెడ్డి

అంకాల పరమేశ్వరీ సేవలో రామానంద భారతీస్వామి

నాగలాపురం: విశాఖపట్నం సౌభాగ్య భువనేశ్వరి రామానంద భారతీస్వామి బుధవారం జానికాపురం గ్రామంలోని శ్రీ అంకాల పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతికి ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.



అంకాల పరమేశ్వరికి పూజలు చేస్తున్న భారతీస్వామి

పనులకు రాకున్నా మస్టర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామంలో ఉపాధి పనులకు రాని కూలీలకు కూడా మస్టర్లు వేస్తున్నారని కూలీలు బుధవారం ఆరోపించారు. ఉపాధి సిబ్బంది చేతివాటం కారణంగా పనులకు రాని వారికి కూలి డబ్బులు వచ్చేలా మస్టర్లు వేస్తున్నారని అన్నారు. దీంతో పనులు చేసిన కూలీలకు రావలసిన కూలీ డబ్బులు తగ్గుతున్నాయని తెలిపారు. ఉపాధి పనుల్లో చేతివాటం చూపుతున్న వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

సంచార జీవన పోరాటం

నిరుపేదరికం.. నిరక్షరాస్యత..బుట్టలు అల్లితేనే అన్నం..లేకపోతే పస్తులతో సహవాసం.. చెట్ల కిందే గుడారాల్లోనే నివాసం..అందని పథకం..అభివృద్ధికి దూరం.. తరతరాలుగా బతుకు పోరాటం.. ఇదీ వరదయ్యపాళెంలోని గిరిజన సామాజిక వర్గం జీవన చిత్రం.

- పథకాలకు నోచుకోని గిరిజన కుటుంబాలు
- గుర్తింపు కార్డులూ లేవు
- గుడారాల్లోనే నివాసం



సిద్ధాపురంలో సంచార కుటుంబాలు



నివాసం కోసం చెట్టు కింద వేసుకున్న గుడారం

వరదయ్యపాళెం: గిరిజనులు నేటికీ అభివృద్ధికి నోచుకోక దుర్భర జీవనం సాగిస్తున్నారు. వరదయ్యపాళెం మండలంలోని తొండంబట్టు పంచాయతీ సిద్ధాపురంలో కె. మునస్వామి, పొన్నెమ్మ, కె. పోలేరయ్య, బీరమ్మ, విజయ్, రూతమ్మ, సాయి, నాగవల్లి, త్యాగరాజు, చదవమ్మ దంపతులు 20 ఏళ్లకు పైగా ఉన్నారు. వీరు ఈత పుల్లలతో బుట్టలు అల్లుతూ సంచార జీవనం సాగిస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి రేషన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు తదితర ఎలాంటి గుర్తింపు కార్డులు నేటికీ అందలేదు. దీంతో వారికి సంక్షేమ పథకాలు కూడా అందడం లేదు. ఈ రోజుకూ చెట్ల కింద వేసుకున్న ప్లాస్టిక్ పరదాల గుడారాలే వారి నివాస గృహాలుగా ఉన్నాయి. ఆ గుడారాల్లో చంటి పిల్లలు, వృద్ధులు దుర్భర జీవితం గడుపుతున్నారు. అయితే వీరి గురించి గ్రామస్థాయి అధికారులు గానీ, ఇతర ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న సందర్భం లేదు. నిరక్షరాస్యులైన వీరికి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లలేని పరిస్థితి ఉంది. రెక్కాడితేగానీ డొక్క నిండని సంచార బతుకులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన ఉంది.

పిల్లలు చదువుకూ దూరమే

బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యాశాఖాధికారులు హడావుడి చేస్తారు. అయితే సిద్ధాపురంలోని ఐదు కుటుంబాల్లో 10 మందికి పైగా పిల్లలున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు కార్డు లేని కారణంగా పాఠశాలల్లో చేర్పించలేకపోతున్నామని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సంచార బతుకులతో పొట్ట నింపుకుంటున్న తాము వారిని కూడా తమ వెంటే తిప్పుతున్నామని చెబుతున్నారు. తమ పిల్లలను ఇప్పటి వరకు బడులకు పంపలేదని చెబుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి నిరక్షరాస్యులైన వారికి జ్ఞానోదయం కలిగించి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించి, అక్షరాస్యులుగా మార్చి, వారి బతుకుల్లో నూతన వెలుగులు నింపాల్సి ఉంది.